## క్లుప్తంగా

### నేడు రైతులకు సదస్సు

కడియం: నర్సరీల్లో సూక్ష్మ పోషకాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా చంటియ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నిపుణుల సూచనలు, సలహాలు అందజేస్తారన్నారు.

### బాధితులకు నిత్యావసరాల పంపిణీ



బాధితులకు సామగ్రి అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గణేష్ సెంటర్ సమీపంలో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన నెల్లి వరలక్ష్మి, వాడబోయిన పైడితల్లి కుటుంబాలను సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, బాధ్యత సేవాసంస్థ అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) పరామర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో బాధితులకు బియ్యం, దుప్పట్లు, వంటసామగ్రి, నిత్యావసరాలను పార్టీ స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు. మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉప సర్పంచ్‌లు బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, బత్తిన అప్పారావు, కాకరపల్లి అప్పారావు, సఫారి నాయుడు, పగడం లక్ష్మణరావు పాల్గొన్నారు.

### పోలీసు స్పందనకు 17 ఫిర్యాదులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 17 అర్జీలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ మాట్లాడారు. సమస్యలను జాప్యం లేకుండా తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### సాకా సురేష్‌కు పురస్కారం

కడియం: వైఎస్సార్ సీపీ నాయకుడు సాకా సురేష్ ఆదివారం రాజమహేంద్రవరం రోటరీ హాల్లో ఉగాది నంది పురస్కారం అందుకున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఉగాది పండగ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను అందజేశారు. తాను నిర్వహిస్తున్న వైద్యశిబిరాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. సినీనటుడు ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా పురస్కారంతో పాటు, సర్టిఫికెట్ ప్రదానం చేశారన్నారు.

### హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ రజనీ

కంబాలచెరువు: దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఈశ్వరరావు కుటుంబానికి అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు కార్పస్ ఫండ్ సొమ్ముకు సంబంధించి చెక్కును ఆయన భార్య ఎస్.ఈశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ... ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసుశాఖ నుంచి అన్నివిధాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి అన్ని బెనిఫిట్లు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

### బహుమతుల ప్రదానం

ప్రకాశం నగర్: దానవాయిపేట మదీనా మసీదు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంజాన్ కప్ – 2023 క్రికెట్ టోర్నీ విజేతకు సోమవారం బహుమతి అందించారు. విజేతగా నిలిచిన ఎంసీసీ సీనియర్స్ జట్టుకు రూ.20 వేలతో పాటు పాటు ట్రోఫీ, రన్నర్స్ ఎంసీసీ జూనియర్స్‌కు రూ.10 వేలతో పాటు ట్రోఫీని అతిథులు ఎండీ అబ్దుల్లా, హబీబుల్లాఖాన్, జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఆరీఫ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. మసీదు కమిటీ ఉపాధ్యక్షుడు షబ్బీర్, కోశాధికారి బషీర్, కార్యదర్శి అల్తాఫ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

మధురపూడి: కోరుకొండ మండలం పశ్చిమగా నుగూడెం జాతీయ రహదారిని దాటుతుండగా మోటారు సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కన్నాబత్తుల లోవరాజుకు శనివారం వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా సహకారం అందించారు. ప్రమాదానికి కారకుడైన మోటారు సైకిలిస్టు ద్వారా రూ.లక్ష అందజేశారు. బాధితుడు లోవరాజు ప్రమాద సంఘటనను విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో ప్రమాదానికి కారకుడితో మాట్లాడి పరిహారం ఇప్పించారు.

# రాగి జావకు రైట్‌రైట్..

- పాఠశాలల్లో నేటి నుంచి బ్రేక్‌ఫాస్ట్‌గా అమలు
- విద్యార్థులకు మరింత పౌష్టికాహారం
- జగనన్న గోరుముద్ద మెనూలో మార్పులు
- 1,26,212 మంది విద్యార్థులకు మేలు



రాగి జావ





పాఠశాలలకు చేరిన రాగి జావ పిండి ప్యాకెట్లు

రాజమహేంద్రవరం రూరల్/కంబాలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికీ సంపూర్ణ పోషకాహారం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకం పటిష్టంగా అమలు చేస్తోంది. దీని మెనూలో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ విద్యార్థులకు మరిన్ని పోషకాలతో కూడిన ఆహారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం అందిస్తున్న ఆహార పదార్థాలతో పాటు మంగళవారం నుంచి విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో రాగి జావ అందించాలని నిర్ణయించింది. ఈ పథకం అమలుకు అవసరమయ్యే బెల్లం, రాగి పిండిని పౌరసరఫరాల శాఖ నుంచి రేషన్ షాపుల ద్వారా పాఠశాలలకు అందిస్తారు. రాగి జావ తయారీపై ప్రభుత్వం వీడియో సైతం విడుదల చేసింది. ఉదయం 8.30 గంటలకు విద్యార్థులకు రాగి జావ అందించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. దీని ద్వారా జిల్లాలోని 986 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1,26,212 మంది విద్యార్థులకు మేలు చేకూరనుంది.

**జగనన్న గోరుముద్ద ప్రస్తుత మెనూ..**

**సోమవారం:** వెజ్ పలావు, గుడ్డు కూర, చిక్కీ
**మంగళవారం:** రాగి జావ, పులిహోర, చెట్నీ, గుడ్డు
**బుధవారం:** వెజ్ బిర్యానీ, బంగాళాదుంప కూర, గుడ్డు, చిక్కీ
**గురువారం:** రాగి జావ, లెమన్ రైస్, టమాటా చెట్నీ, గుడ్డు
**శుక్రవారం:** అన్నం, పప్పు, గుడ్డు, చిక్కీ
**శనివారం:** రాగి జావ, ఆకుకూర అన్నం, స్వీట్ పొంగల్

**మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు**

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు |
|---|---|---|
| అనపర్తి | 42 | 4,481 |
| బిక్కవోలు | 39 | 4,689 |
| చాగల్లు | 39 | 4,547 |
| దేవరపల్లి | 45 | 6,218 |
| గోకవరం | 51 | 6,530 |
| గోపాలపురం | 52 | 5,783 |
| కడియం | 51 | 6,230 |
| కోరుకొండ | 55 | 7,776 |
| కొవ్వూరు | 54 | 6,622 |
| నల్లజర్ల | 58 | 6,686 |
| నిడదవోలు | 70 | 7,063 |
| పెరవలి | 48 | 4,220 |
| రాజమహేంద్రవరం రూరల్ | 57 | 10,719 |
| రాజమహేంద్రవరం అర్బన్ | 87 | 18,320 |
| రాజానగరం | 61 | 7,720 |
| రంగంపేట | 48 | 5,027 |
| సీతానగరం | 57 | 5,146 |
| తాళ్లపూడి | 32 | 4,000 |
| ఉండ్రాజవరం | 40 | 4,435 |
| మొత్తం | 986 | 1,26,212 |

### ప్రతి విద్యార్థి తాగేలా చూస్తాం



ప్రభుత్వ పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి రాగిజావ తాగేలా చూస్తాం. అది తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను పిల్లలకు వివరిస్తాం. ఈ మేరకు హెచ్‌ఎమ్‌లు, ఉపాధ్యాయులందరికీ సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశాం.

– బి.దిలీప్‌కుమార్, అర్బన్ రేంజ్ డీఐ, రాజమహేంద్రవరం

### నేటి నుంచి అమలు



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు మంగళవారం నుంచి రాగి జావ అందించేందుకు చర్యలు చేపట్టాం. మధ్యాహ్న భోజన నిర్వాహకులు వారానికి మూడు రోజులు రాగి జావ తయారు చేసి విద్యార్థులకు అందించాలి.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి

### పోషకాలు అధికం



వేరుశనగ, నువ్వులు, ఆకుకూరలు, గుడ్డుతో పాటు రాగి పిండిలో కాల్షియం పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల దృఢత్వానికి, బలాన్ని అందించేందుకు తోడ్పడతాయి. పిల్లల్లో ఎదుగుదలకు, రక్తహీనత నివారణకు ఉపయోగపడతాయి. వేసవిలో రాగి జావ వేడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

– డాక్టర్ కె.సుధాకర్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ధవళేశ్వరం

## మత్స్యసంపద యోజనను వినియోగించుకోవాలి

కలెక్టర్ డాక్టర్ మాధవీలత



ఫిష్‌ఆంధ్రా పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ప్రధానమంత్రి మత్స్యసంపద యోజనను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. నగరంలోని అన్నపూర్ణమ్మపేట ఆజాద్ చౌక్ ప్రాంతంలో రూ.50 లక్షలతో ఏర్పాటు చేయనున్న ఫిష్‌ఆంధ్రా లాంజ్‌ను సోమవారం కమిషనర్ దినేష్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన బ్రాండ్ ఫిష్‌ఆంధ్రా ద్వారా దేశీయ చేపల మార్కెటింగ్‌ను ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్రానికి రెండు ప్రాజెక్టులు మంజూరు కాగా, అందులో ఒక యూనిట్ రాజమహేంద్రవరంలో నిర్మాణ దశలో ఉందన్నారు. లబ్ధిదారు వి.ఉమామహేశ్వరి తన సొంత స్థలంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటుకు ముందుకు వచ్చారన్నారు. మత్స్య శాఖ జేడీ కృష్ణారావు మాట్లాడుతూ పీఎంఎంఎస్‌వై సబ్సిడీ కింద ఎస్టీ, ఎస్సీ మహిళలకు 60 శాతం, జనరల్ కేటగిరీకి 40 శాతం ఫిష్ ఆంధ్రా లాంజ్ యూనిట్ స్థాపనకు ప్రోత్సాహం ఇవ్వడం జరిగిందన్నారు.

**పారిశుధ్య నిర్వహణలో సహకరించాలి**

నగరంలో పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రజలు క్రమశిక్షణ పాటించాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నగర పాలక సంస్థకు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్‌తో కలిసి సోమవారం స్థానిక అన్నపూర్ణమ్మపేటలో ప్రజలతో మాట్లాడారు.

## కుక్కల సంతతి నియంత్రణకు చర్యలు

- కార్పొరేషన్ ఆధ్వర్యంలో డ్రైవ్
- ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్



యానిమల్ బర్త్ కంట్రోల్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: కుక్కల సంతతి నియంత్రణకు నగరపాలకసంస్థ చర్యలు చేపట్టడం హర్షణీయమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 49వ డివిజన్‌లోని యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రం వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా ఏబీసీ అండ్ ఏఆర్వీ డ్రైవ్‌ను సోమవారం ఎంపీ భరత్‌రామ్, కమిషనర్ దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సర్వే ప్రకారం నగరంలో దాదాపు 15 వేల కుక్కలు ఉన్నట్టు తెలుస్తోందని, వీటి సంతతి సంఖ్యను తగ్గించేందుకు ఏబీసీ ఆపరేషన్లు అత్యవసరమన్నారు. అలాగే యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ (ఏఆర్వీ) కోసం వీధి కుక్కల డ్రైవ్‌ను పశుసంవర్ధకశాఖ, జంతు ప్రేమికులు సంయుక్తంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం 150 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు నిర్వహిస్తారని, ఇలా వారానికి 500 కుక్కలకు చేస్తారన్నారు. వారం రోజుల పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా సంబంధిత అధికారులు తీసుకుంటారన్నారు. సుప్రీంకోర్టు నిబంధనల మేరకు ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పిగ్ ఫ్రీ సిటీగా, బెగ్గర్స్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ ఏబీసీ ఆపరేషన్ చేసిన ప్రతి కుక్కకూ ఐయామ్ వ్యాక్సినేటెడ్ అనే రేడియం టాగ్ కట్టి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీసీ పి.సత్యవేణి, అడిషనల్ ఎంహెచ్‌ఓ డాక్టర్ జి.మధుబాబు, వెటర్నరీ డాక్టర్ అరుణ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, డివిజన్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు, పాలిక శ్రీను, చోడిశెట్టి సత్యవాణి, గుడాల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే సుందర నగరం

- నగరపాలకసంస్థకు సహకరించాలి
- గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్ రామ్



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల భాగస్వామ్యంతోనే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడం, పారిశుధ్య నిర్వహణ సాధ్యమవుతుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక 24వ డివిజన్ గీతాఅప్సరా థియేటర్ పక్కవీధి కేవీఆర్ స్వామి రోడ్డు నుంచి సోమవారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. రోడ్డును ఆనుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారితో ఎంపీ మాట్లాడారు. ఆకుకూరలు విక్రయించుకునే మహిళలు మాట్లాడుతూ తమకు ప్రతినెలా పింఛన్ వస్తోందని, జగనన్న వల్లనే మా జీవితం హాయిగా గడిచిపోతోందని ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఎంపీ అడిగి తెలుసుకున్నారు. అక్కడ చెత్తా చెదారాన్ని చూసి ఇలా వ్యర్థాలను వదిలేయకండి.. డస్ట్‌బిన్లలో వేస్తే నగర పాలక సిబ్బంది వచ్చి తీసుకువెళతారని సూచించారు. అపరిశుభ్రతను చూసి నగరపాలక శానిటరీ అధికారులకు, సిబ్బందికి తక్షణమే చర్యలు చేపట్టాలంటూ ఆదేశాలిచ్చారు. మెయిన్‌రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, 24వ వార్డు ఇన్‌చార్జి అరవ సురేష్, బెజవాడ రాజ్‌కుమార్, కాంతారాం పాటిల్, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

## న్యాయశాస్త్రంలో లక్ష్మణరావుకు పీహెచ్‌డీ



ఏయూ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న లక్ష్మణరావు

ఆల్కాట్‌తోట: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాల బయ్యే లక్ష్మణరావుకు పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆయన ఆచార్య డి.సూర్యప్రకాశరావు మార్గదర్శకత్వంలో ఉమెన్ అగ్రికల్చర్ లేబర్ – పాలసీ పర్స్‌పెక్టివ్స్:ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్‌సెలెక్టెడ్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశం మీద థీసెస్ సమర్పించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మణరావు.. పశ్చిమగోదావరి జిల్లాలోని వ్యవసాయ కూలీల స్థితిగతులు, సంబంధిత చట్టాలపై పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియాలజీలో ఎమ్మెస్సీ చేసి ఉద్యోగంలో చేరారు. తర్వాత న్యాయవిద్యపై మక్కువతో రాత్రి కళాశాలలో బీఎల్, ఆ తరువాత పార్ట్‌టైమ్‌లో ఎమ్మెల్ డిగ్రీలు పూర్తి చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం పీహెచ్‌డీ చేశారు. ఆయనకు డాక్టరేట్ రావడంపై ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాల ఆచార్యులు, పరిశోధకులు, మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

## ప్రజాసంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఏపీజీఅండ్‌బీసీ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- బొమ్మూరులో గడపగడపకూ మన ప్రభుత్వం



పాత బొమ్మూరులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజాసంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు –2 సచివాలయం పరిధిలోని పాతబొమ్మూరు, సోమనవారితోట ప్రాంతాల్లో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, వలంటీర్లు, అధికారులతో కలిసి 560 కుటుంబాలను కలిశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వారికి వివరించి, బుక్‌లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, విద్యుత్, రోడ్ల సమస్యలను చందన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి కూడా అమలు చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు జగనన్నకు కొండంత బలమన్నారు. టీడీపీ కుట్ర, స్వార్థ రాజకీయాలను గమనించాలని సూచించారు. మండల ఇంజినీర్ సంపత్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సచివాలయం కన్వీనర్లు మత్సేటి శివ, సోమన శ్రీనివాస్, రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ముద్దాల అను, పార్టీ నాయకులు యెనుముల త్యాగరాజు, ఎలుగొండ లక్ష్మి, దాకే శ్రీనివాస్, కేవీ సుబ్బారెడ్డి, తోడేటి రాహుల్, హర్ష, లారీ శ్రీను పాల్గొన్నారు.

## పిచ్చుకల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సత్యగోవింద్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ రక్షణకు ఎంతో దోహదపడే పిచ్చుకలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పశు సంవర్ధక కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యగోవింద్ మాట్లాడుతూ నేటి టెక్నాలజీ పరంగా మైక్రోన్ టవర్స్ రేడియేషన్, పంటలపై క్రిమిసంహారక మందుల వినియోగం ఎక్కువగా ఉండడంతో చాలా పక్షులు అంతరించిపోతున్నాయన్నారు. పిచ్చుకల కోసం నీటి కుండలను, ధాన్యపు కంకులను, గూళ్ల ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా జంతుహింస నివారణ సంఘ సభ్యులు గోపీకాంత్, రాజ్ కటారియా, విజయ్ కిషోర్, పశువైద్యుడు ఏవీవీ ప్రసన్నకుమార్, పశువైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ యోగానంద్ పాల్గొన్నారు.

## ఘనంగా మద్దూరి అన్నపూర్ణయ్య జయంతి



శ్రీపాద శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

ప్రకాశం నగర్: స్థానిక జెండాపంజా రోడ్డులోని మద్దూరి అన్నపూర్ణయ్య పార్కులో సోమవారం స్వాతంత్ర సమరయోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2023 సంవత్సరానికిగాను మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక అవార్డును శ్రీపాద లక్ష్మీనరసింహ నాగశ్రీనివాస్‌కు అందజేశారు. అలాగే బెజవాడ మహేంద్ర, మాజీ కార్పొరేటర్ ద్వారా పార్వతీ సుందరి, ఓల్లేటి దివాకర్, వేములవాడ వెంకటకృష్ణారావు, ఒలింపీడ్ నెల్సన్ ఆంథోనీలకు అన్నపూర్ణయ్య పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ భరతరామ్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### వైభవంగా అమ్మవారి జాతర

సీతానగరం: గ్రామంలోని సంతలో మునలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరుగుతోంది. ఈనెల 18న ప్రారంభమైన ఈ జాతర 25 వరకు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక నాలుగు బొమ్మల సెంటర్ వద్ద గల అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

## వివిధ కేటగిరీల్లో 12 ఉత్తమ పురస్కారాలు



ఉత్తమ క్లబ్ అవార్డు తీసుకుంటున్న వెంకటరెడ్డి తదితరులు

పెదపూడి: జి.మామిడాడలోని లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీ సూర్య క్లబ్ జిల్లాలో రీజియన్–3లో నిర్వహించిన భావన అవార్డు ప్రదానోత్సవంలో వివిధ కేటగిరీల్లో 12 ఉత్తమ పురస్కారాలను కైవసం చేసుకుందని క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాళ్లరేవులో ఆదివారం రాత్రి నిర్వహించిన రీజియన్ క్లబ్‌ల సమావేశంలో 2022–2023 సంవత్సరానికి ప్రకటించిన అవార్డుల్లో ఉత్తమ అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకటరెడ్డి, ఉత్తమ కార్యదర్శిగా ద్వారంపూడి యువరాజారెడ్డి, ఉత్తమ కోశాధికారిగా డీఆర్‌కె రెడ్డితో పాటు రీజియన్ ఉత్తమ క్లబ్‌గా, పలు సేవా కార్యక్రమాల విభాగాల్లోనూ పురస్కారాలు లభించాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, సబ్బెళ్ల మోహన్ రెడ్డి, ద్వారంపూడి వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.